
సాక్షి
పల్నాడు
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



పోలింగ్ ఏర్పాట్లు పరిశీలన

ముప్పాళ్ల: ముప్పాళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎమ్.భవానీశంకర్ సోమవారం పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 532.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.



యూరియా దిగుమతి

తెనాలిటౌన్: రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా జొన్న, మొక్కజొన్న పంటలకు అవసరమైన యూరియాను సోమవారం రైలు వ్యాగన్ ద్వారా తెనాలికి దిగుమతి అయ్యింది.

న్యూస్‌రీల్

శ్రీలక్ష్మి హుండీ ఆదాయం రూ.15 లక్షలు

దుర్గి: అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.15,52,027 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సైదమ్మ బాయి తెలిపారు. సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో 45 రోజుల పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. ఈ ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రశీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వర క్షేత్రానికి వెండి ఆభరణాలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరుని ఆలయంలోని ఉత్సవమూర్తులకు ధరణికోటకు చెందిన పర్రా వేణుబాబు, నిత్య దంపతులు 1,137 గ్రాముల బరువుగల పాదాలు, తదితర వెండి ఆభరణాలు సోమవారం సమర్పించారు. సోమవారం అమరేశ్వరునికి బాలచాముండేశ్వరికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాలతో దాతలు ఆలయ ప్రదక్షిణ చేసి సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి ఈఓ సునీల్‌కుమార్‌కి ఆభరణాలు అప్పగించారు. అమరేశ్వర క్షేత్రంలోని సుబ్రమణ్యేశ్వరస్వామికి రజిత ముఖకవచం, యజ్ఞోపవీతాన్ని అమరావతికి చెందిన రాఘవపురపు అప్పారావు, దంపతులు సోమవారం సమర్పించారు. తొలుత స్వామికి పూజలు నిర్వహించిన అనంతరం ఈవో సునీల్‌కుమార్‌కి ఆభరణాలు అప్పగించారు.

గజ వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం గజవాహనంపై మల్లేశ్వరుడు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళగిరి శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం కైంకర్య పరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈవో జె.వి.నారాయణ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతక్రింద కనకయ్య, దామర్ల కుబేరస్వామి, శివాలయం, సీతారామ దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు బోగి కోటేశ్వరరావు, మునగపాటి వెంకటేశ్వరరావు, వాకా మంగారావు తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 1,52,043 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,52,043 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,36,859 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,200 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 69,869 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

బేరీజు.. బేజారు

- రూ.60 కోట్ల సేవాపన్ను ఎగవేతదారునిగా ఆలపాటి
- భూకబ్జాలు, రౌడీయిజం, అనైతిక రాజకీయాలు..
- ఎన్నికల సమయంలోని కరపత్రాలు వెలుగులోకి..
- వైఎస్సార్ సీపీకి దగ్గరంటూ లక్ష్మణరావుపై ట్రోలింగ్
- పోటాపోటీగా సోషల్ మీడియాలో పరస్పర పోస్టింగులు
- అభ్యర్థుల గుణగణాలపై పట్టభద్రుల లోతైన పరిశీలన
- ఓటర్లు బేరీజు వేసుకుంటున్నారంటూ కూటమిలో బేజారు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఓటర్లు నిశానీలు కారు. పట్టభద్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చిరుద్యోగులు, నిరుద్యోగులు. విభిన్న రంగాలు, వర్గాలకు చెందిన 3,47,116 మంది ఓటర్లు. సోషల్ మీడియాలో ప్రధాన పోటీదారుల గుణగణాలు, గత చరిత్ర, రాజకీయ వ్యవహారాలు ఆధారసహితంగా హోరెత్తుతున్నాయి. పలు ఊహాజనిత, నిరాధార ఆరోపణలూ జోరందుకున్నాయి. ఈ ఎన్నికలు ఈవీఎంలతో కాదు బ్యాలెట్ పేపర్ పద్ధతిలో జరగనున్నాయి. తొమ్మిది నెలలుగా పచ్చమీడియా సహకారంతో పడికట్టు, కనికట్టు మాటలతో మోసగిస్తున్న ప్రభుత్వ పాలనా తీరు ప్రతిఒక్కరి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. అసలే రాజకీయ చైతన్యవంతమైన జిల్లాలకు చెందిన పట్టభద్రులు ప్రతిదీ బేరీజు వేసుకుని కత్రుకాల్చి వాతపెడతారేమోననే బేజారు టీడీపీ నేతల మాటల్లో వ్యక్తమవుతోంది.

కూటమి నేతల్లో ఆందోళన

కృష్ణా– గుంటూరు పట్టభద్రుల స్థానానికి ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తున్న కొద్దీ కూటమి నేతల్లో ఆందోళన అధికమవుతోంది. ఈనెల 27న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో టీడీపీకి చెందిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రధాన పోటీదారైన పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు మద్దతుదారులు పోటాపోటీగా సోషల్ మీడియా వార్‌కు తెరతీశారు. అభ్యర్థులిద్దరూ జిల్లా కేంద్రమైన గుంటూరుకు చెందిన వారైనప్పటికీ రాష్ట్ర రాజకీయాలలో సుపరిచితులు.



కేఎస్ లక్ష్మణరావు



ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

మాజీ మంత్రి ఆలపాటి సీనియర్ నాయకుడు. విద్యావేత్త అయిన లక్ష్మణరావు 14 ఏళ్లుగా శాసనమండలి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కూటమి అభ్యర్థి గురించి ఆయా సందర్భాలలో తీవ్ర అవినీతి ఆరోపణలు, ఆర్థిక అరాచకాలు, రౌడీయిజం, దాడులు లాంటి నేరారోపణలు, పలు విమర్శలు లేకపోలేదు. వాటన్నింటినీ గుర్తుచేస్తూ సోషల్ మీడియా ద్వారా ప్రజల దృష్టికి తీసుకొస్తుండటం తాజాగా చర్చనీయాంశమైంది. కూటమి నేతలకు ఇది కొరుకుడుపడని అంశంగా మారి ఆందోళన రేకెత్తిస్తోంది.

రూ.60 కోట్ల పన్ను ఎగవేత?

ఆర్థిక లావాదేవీల్లో లోపాలతోపాటు పన్నులు ఎగ్గొట్టారనే నేరారోపణలు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై ఉన్నాయి. అప్పీలుకు వెళ్లగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా తోసిపుచ్చాయని, పన్నులు చెల్లించాల్సిందేనని హైకోర్టు నిర్ధారించిందని రాజకీయ ప్రత్యర్థులు గుర్తుచేస్తున్నారు. ఎన్.ఆర్.ఐ. విద్యా సంస్థల ద్వారా విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజుల్లో అరవై కోట్ల రూపాయలకు పైగా సర్వీసు టాక్సును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని, దీనిపై ఇప్పటికీ న్యాయస్థానాల్లో కేసులు కొనసాగుతున్నాయని అంటున్నారు.

- తెనాలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేస్తారనే అంచనాలతో ఆలపాటి రాజకీయ ఆరంగేట్రం మొదలు ఆయన అకృత్యాలంటూ ప్రత్యర్థులు కరపత్రాలు ముద్రించి మరీ ప్రజల దృష్టికి అనేక అంశాలను ఇదివరకే తీసుకొచ్చారు. పల్నాడు ప్రాంతంలో గొర్రెల పెంపకం మాటున, సాఫ్ట్‌వేర్ సంస్థ చాటున, గుంటూరులో చిట్‌ఫండ్, ఫైనాన్స్ ద్వారా, తన సంబంధీకుల పేరుతో, ఇతర బినామీల పేరిట రియల్ ఎస్టేట్ ముసుగులో అటు బ్యాంకులను, ఇటు ప్రజలను మోసం చేశారని, తన రాజకీయ పలుకుబడి, దౌర్జన్యాలతో సెటిల్‌మెంట్లు చేసుకున్నారనే ఆరోపణలు గుప్పించారు. మంత్రిగా ఉన్నప్పుడు భారీగా జిల్లాలో ఇసుక కుంభకోణాలకు పాల్పడ్డారని, ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతుల ద్వారా రూ.కోట్లు సంపాదించారని, మంగళగిరి– తాడేపల్లి పరిధిలోని ఆంధ్ర సిమెంటు ఫ్యాక్టరీని బినామీ పేర్లతో కొనుగోలుచేసి కార్మికులకు నష్టం చేశారని, విభిన్న ప్రాంతాల్లో క్రిష్టియన్ ఆస్తులను కొల్లగొట్టి స్థిరాస్తులుగా మలచుకున్నారనే తీవ్రారోపణలు లేకపోలేదు. ఎన్.ఆర్.ఐ ఆసుపత్రి వ్యవహారాల్లోనూ ఆలపాటిపై అనేక విమర్శలు రావడాన్ని గుర్తుచేస్తున్నారు.

లక్ష్మణరావుపైనా పోస్టింగులు..

పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుపైనా సోషల్ మీడియాలో వ్యతిరేక ప్రచారం పెచ్చరిల్లుతోంది. అవినీతి ఆరోపణలు, రాజకీయపరమైన అంశాలు అటుంచి వ్యక్తిత్వ హననానికి ప్రత్యర్థులు తెగపడ్డారని, లేనిపోని విషయాలను చిలవలు పలవలు చేస్తున్నారని ఆయన మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వినతి పత్రం ఇచ్చేప్పుడు కిందపడిన కాగితాలను తిరిగి తీసుకునే క్రమంలో లక్ష్మణరావు సీఎం పాదాలకు నమస్కరించారని, ఆయన వైఎస్సార్ సీపీ మద్దతుదారు అని ట్రోల్ చేయడం వారి దిగజారుడుతనానికి పరాకాష్ఠ అంటున్నారు. మూడు పర్యాయాలు పీడీఎఫ్ సభ్యునిగా శాసన మండలికి ఎన్నికై విభిన్న అంశాలను చర్చకు తీసుకొచ్చి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేసిన లక్ష్మణరావుపై యూటీఎఫ్ తదితర సంఘాల పేరిట తప్పుడు పోస్టింగులు కూడా పెట్టిస్తుండటాన్ని ఆయా సంఘాల నేతలు ఖండిస్తున్నారు. కె.ఎస్.లక్ష్మణరావుపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు సోమవారం ఫిర్యాదులు చేయడం గమనార్హం.

ఏకాదశివందనం

భక్తులతో కిక్కిరిసిన కోటప్పకొండ





క్యూలైన్‌లో భక్తుల రద్దీ (ఇన్‌సెట్) త్రికోటేశ్వర స్వామి

- ఏకాదశి సందర్భంగా త్రికోటేశ్వరునికి విశేష అభిషేకాలు
- స్వామిని దర్శించుకున్న వేలాది మంది
- బాలప్రభలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

నరసరావుపేట రూరల్: ఏకాదశిని పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం భక్తులతో సోమవారం కిక్కిరిసిపోయింది. వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు స్వామికి బిందె తీర్థం, పంచామృతాలు, ఫలరసాలు, సుగంధద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీ దృష్ట్యా మూలవిరాట్ అభిషేకాలు ఈనెల 27 వరకు నిలిపివేశారు. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉచిత క్యూలైన్లలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయం వెనుక రావిచెట్టు వద్ద, ధ్యానశివుడు, మహానందీశ్వరుడి వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. మహిళలు పొంగళ్లు పొంగించి స్వామికి సమర్పించారు. నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. సోపాన మార్గంలో మెట్ల పూజ చేసుకుంటూ భక్తులు కొండమీదకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ, పరిసర గ్రామాల నుంచి మొక్కుబడి బాల ప్రభలు కొండకు వచ్చాయి. పార్కింగ్ ప్రాంతం వాహనాలతో నిండిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ఉచిత ప్రసాదవితరణ చేశాయి. ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు తెల్లవారుజామున స్వామిని దర్శించుకున్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు 556 బస్సులు

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల నుంచి కోటప్పకొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం మొత్తం 556 బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్వీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. తిరునాళ్లలో సుమారు 2వేల మంది ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తారని అన్నారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ గతేడాది మాదిరిగా ఈ ఏడాది కూడా కొండ దిగువ నుంచి కొండపైకి వీఐపీల కోసం 20 ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. కొండ దిగువ నుంచి పై భాగంకు భక్తులను చేరవేసేందుకు 65 బస్సులను నిర్వహిస్తున్నామన్నారు. దీంతో పాటు నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి 185, చిలకలూరిపేట నుంచి 116, వినుకొండ నుంచి 45, గుంటూరు నుంచి 35, చీరాల నుంచి 45, ఒంగోలు నుంచి 45 బస్సులను సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. అలాగే నరసరావుపేట డిపో పరిధిలో 1,500 మంది, చిలకలూరిపేట డిపో పరిధిలో 800 మంది ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తారన్నారు. కోటప్పకొండ, చిలకలూరిపేట, నరసరావుపేటలలో మొత్తం ఆరు ప్రత్యేక బస్‌స్టేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా నరసరావుపేట నుంచి కొండవరకు రూ.30లు, కొండ దిగువ నుంచి పైకి రూ.25 చార్జీలు వసూలు చేస్తామని పేర్కొన్నారు.

అమరం.. మనో'హర'ం

- రేపు అమరేశ్వరుని కల్యాణోత్సవం
- మహాశివరాత్రి సందర్భంగా వైభవంగా బ్రహ్మోత్సవాలు
- 27న స్వామివారి దివ్య రథోత్సవం
- ప్రణవనాదంతో మార్మోగుతున్న అమరారామం



విశేష అలంకారంలో అమరేశ్వరుడు

అమరావతి: డమరుకనాదం మార్మోగుతోంది. అమరావతి అమరేశ్వరుని ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం అమరేశ్వరుని కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. 27న స్వామి దివ్యరథోత్సవం నిర్వహించనున్నారు.

ఆలయ విశిష్టత ఇదీ..

పురాణాల్లో అమరావతి క్షేత్రానికి విశిష్టత ఉంది. శ్రీశైలానికి ఈశాన్య భాగాన కృష్ణానది దక్షిణపు గట్టున అమరావతి క్షేత్రం భాసిల్లుతోంది. స్కంద పురాణాన్ని అనుసరించి తారకాసురుని ఉదరంలోని అమృత లింగాన్ని కుమారస్వామి ఛేదించడంతో ఐదు శకలాలలో ఒకటి పంచారామాలలో ఒకటైన అమరారామంలో అమరేశ్వరునిగా ఉద్భవించి భక్తుల పూజలందుకుంటున్నట్లు ప్రతీతి. ఇంద్రుడు దేవగురువైన బృహస్పతి ఆధ్వర్యంలో బాలచాముండీ సహిత అమరేశ్వర స్వామిని ఆశ్వీయుజశుద్ధ దశమి నాడు ప్రతిష్ఠించి కల్యాణోత్సవం జరిపించారని పురాణాలు చెబుతున్నాయి. క్రీస్తుపూర్వం ఐదు వందల సంవత్సరాల నుంచి ఈ క్షేత్రం విరాజిల్లుతోందని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.

బ్రహ్మోత్సవం.. దివ్యోత్సవం..

అమరేశ్వరుని బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, వాస్తుపూజ, వాస్తుహోమం, పర్యగ్నీకరణం, మృత్సంగ్రహణ, అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలను అర్చకులు వైభవంగా జరిపించారు. మంగళవారం రాత్రి స్వామికి పులివాహన సేవ నిర్వహించనున్నారు. బుధవారం మహా శివరాత్రి పర్వదినాన ఉదయం 3 గంటలకు ఏకరుద్రాభిషేకాలు ప్రారంభమవుతాయి. రాత్రి 12 గంటలకు లింగోద్భవకాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం, రాత్రి ఒంటిగంటకు అమ్మ, స్వామివార్ల ఎదుర్కోలు ఉత్సవం, 2.45 గంటలకు దివ్య కల్యాణ మహోత్సవం వైభవంగా జరగనున్నాయి. 27వ తేదీ ఉదయం 8 గంటలకు చిలుక, నంది, చిన్నరథ వాహనాలలో స్వామి గ్రామోత్సవం, సాయంత్రం 4 గంటలకు స్వామి దివ్య రథోత్సవం, రాత్రి 7 గంటలకు స్వామికి కీలు గుర్రం సేవ నిర్వహిస్తారు. 28వ తేదీన చూర్ణోత్సవం, వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజావరోహణం జరగనున్నాయి. మార్చి 1 నుంచి మూడు రోజుల పాటు స్వామికి ఏకాంత సేవ, పుష్పయాగశయనోత్సవాలు శాస్త్రోక్తంగా శైవాగమ శాస్త్ర ప్రకారం నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు అమరావతిని సందర్శించి అమరేశ్వరుని దర్శించి తరించనున్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు

ఉత్సవాల కోసం దేవస్థాన అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈనెల 26, 27 తేదీలలో ఆర్టీసీ అమరావతికి ప్రత్యేక బస్సులు నడపనుంది. గుంటూరు, సత్తెనపల్లి, మంగళగిరి విజయవాడల నుంచి సుమారు 60 బస్సు సర్వీసులు ఏర్పాటు చేసింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సుమారు 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ అచ్చియ్య తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఈవో సునీల్‌కుమార్ వెల్లడించారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేయండి

అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, తదితరులు

అమరావతి: అమరేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల జయప్రదానికి అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం అమరేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలకు నీరు లేకపోవడంతో జల్లు స్నానం చేయాలని భక్తులకు సూచించారు. బందోబస్తు పటిష్ఠం చేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని శైవక్షేత్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని చెప్పారు. భక్తులకు ఏమైనా ఇబ్బందులు కలిగితే 112 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. తొలుత కలెక్టర్, ఎస్పీ ఆలయంలో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధికారులకు అర్చకులు వేదాశీర్వచనం అందించారు. స్వామి శేష వస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ రమణకాంతరెడ్డి, సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, ఆలయ ఈఓ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల: ప్రతిపక్షాన్ని గుర్తించండి... ప్రజాస్వామ్యాన్ని కాపాడండి నినాదంతోనే అసెంబ్లీకి వెళ్లామని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి శాసన సభకు వెళితే ఏరకమైన సినిమా కనిపిస్తుందో కూటమి నాయకులకు తెలుసన్నారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేకపోయారని విర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడటం మొదలు పెడితే కూటమి నాయకులు సమాధానం చెప్పలేరన్నారు. దీనిని తప్పించుకోవడం కోసమే ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా వ్యవహరిస్తున్నారని పిన్నెల్లి మండిపడ్డారు.

స్పోర్ట్స్ స్టైఫండ్‌కు దరఖాస్తు చేసుకోండి

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలో వివిధ క్రీడాంశాలలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు 2025-26 సంవత్సరానికి స్పోర్ట్స్ స్టైఫండ్ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా క్రీడాకారులకు స్టైఫండ్ అందిస్తోందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన 15 నుంచి 24 సంవత్సరాల వయస్సు గల క్రీడాకారులు తమ ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డుతో https://fci.gov.in వెబ్‌సైట్‌లో మార్చి 6వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పురుషులకు ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్ విభాగాలలోనూ, మహిళలు, పురుషులకు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాలలో స్టైఫండ్ అందిస్తారని వివరించారు. ఇతర వివరాలకు ఎఫ్‌సీఐ వెబ్‌సైట్‌ను దర్శించాలని కోరారు.

ఎరువుల వ్యాపారులు పరారీ

దాచేపల్లి : దాచేపల్లికి చెందిన ఇద్దరు ఫర్టిలైజర్ వ్యాపారులు సోమవారం కుటుంబ సభ్యులతో సహా పరారయ్యారు. దాచేపల్లి మసీదు సెంటర్‌లో ఎరువు దుకాణం నిర్వహిస్తున్న వీరిద్దరూ సుమారు రూ.10 కోట్లకుపైగా అప్పులు చేసినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. దుకాణంతోపాటు, వ్యాపారుల నివాస గృహాలకు తాళాలు వేసి ఉండటంతో అప్పులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారుల ఆచూకీ కోసం యత్నించినా సమాచారం లేదు. వ్యాపారుల అదృశ్యంపై బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాచేపల్లిలో వ్యాపారులు అదృశ్యం కావడం ఇటీవల తరచూ జరుగుతూనే ఉంది. ఓ బంగారం వ్యాపారి రూ.15 కోట్లు అప్పులు చేసి పరారయ్యాడు. తాజాగా మరో ఇద్దరు వ్యాపారులు అదృశ్యం కావడం చర్చనీయాంశమైంది. ఐపీ పెట్టేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. వరుసగా వ్యాపారులు ఐపీ పెట్టడంతో అప్పులు ఇచ్చిన వారంతా గగ్గోలు పెడుతున్నారు.

కోటప్పకొండలో ట్రాఫిక్ ఆంక్షలు

- ఎస్పీ కె.శ్రీనివాసరావు
- కోటప్పకొండ తిరనాళ్లపై సిబ్బందితో సమీక్ష

నరసరావుపేట రూరల్/నరసరావుపేట టౌన్: కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే యాత్రికులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. తిరునాళ్ల విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులతో సోమవారం కోటప్పకొండ జెడ్పీ హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పండుగ హోదా కలిగిన కోటప్పకొండ తిరునాళ్లకు ఏపీతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు వస్తారని తెలిపారు. యాత్రికులకు ఇబ్బంది కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వివరించారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సంతమాగులూరు వైపు నుంచి కొండకు వచ్చే మార్గాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ట్రాఫిక్‌ను పర్యవేక్షించేందుకు డ్రోన్‌ను వినియోగిస్తున్నట్టు వివరించారు.. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంతోష్, డీఎస్పీ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ కె.నాగేశ్వరరావు ట్రాఫిక్ ఆంక్షలు, పార్కింగ్ ప్రదేశాల వివరాలు వెల్లడించారు.

ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 3,000 మందితో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనుమానిత ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. డ్రోన్ కెమెరాలతో సాంకేతిక నిఘాను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వివరించారు. ప్రభల వద్ద అశ్లీల నృత్యాలు నిర్వహించకుండా ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామని చెప్పారు. సమావేశంలో సీఐలు ఎంవీ. చరణ్, ప్రభాకర్, రమేష్, లోకనాథం, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

పార్కింగ్ ప్రదేశాలివే..

➡ పాస్ ఉన్న వారు నరసరావుపేట నుంచి పెట్లూరివారిపాలెం మీదుగా వచ్చి ఘాట్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో వాహనాలు ఆపాలి.

➡ చిలకలూరిపేట నుంచి వచ్చే వారు యూటీ సెంటర్ మీదుగా క్రషర్స్ మార్గం ద్వారా వెలుపలికి వచ్చి వాహనాలు నిలుపుకోవాలి. అక్కడి నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల్లో కొండపైకి చేరుకోవాలి.

➡ పట్టణం నుంచి కోటప్పకొండకు వచ్చే ప్రభలు బుధవారం ఉదయం 12 గంటలకు బయలు దేరి సాయంత్రం 4 గంటల లోపు ప్రభల నిధి వద్దకు చేరుకోవాలి.

➡ సంతమాగులూరు, అద్దంకి మండలాల నుంచి వచ్చే వారు మన్నేపల్లి, లక్ష్మీపురం, పెట్లూరివారిపాలెం మీదుగా ఘాట్‌రోడ్డు పక్కన పార్కింగ్ వద్దకు చేరుకోవాలి.

➡ ఏఎం రెడ్డి కళాశాల ఎదురుగల పోలీస్ చెక్ పోస్టు నుంచి కోటప్పకొండ వైపునకు వాహనాలకు అనుమతి లేదు.

➡ చిలకలూరిపేట నుంచి ప్రభల వద్దకు వచ్చే వారు యడవల్లి అట్టల ఫ్యాక్టరీ ఎదురుగా గల రోడ్డు నుంచి కట్టుబడివారిపాలెం మీదుగా ప్రభల నిధి వద్దకు చేరుకోవాలి..

➡ ఘాట్‌రోడ్డు, మెట్ల మార్గం ద్వారా నడిచి వెళ్లే భక్తులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య మాత్రమే అనుమతి ఉంది.

కోటప్పకొండ నుంచి స్వస్థలాలకు ఇలా వెళ్లాలి..

➡ రెడ్ల సత్రం వైపు నుంచి నరసరావుపేటకు వెళ్లే వారు చిలకలూరిపేట మేజర్ కెనాల్ మీద ఏర్పాటు చేసిన రూట్‌లో మాత్రమే వెళ్లాలి. గురవాయపాలెం, యల్లమంద మీదుగా అనుమతి లేదు.

➡ పార్కింగ్ ప్రదేశం నుంచి వెళ్లే వాహనాలు కొండకావూరు, పమిడిమర్రు గ్రామాల మీదుగా జేఎన్‌టీయూ కళాశాల వద్దకు చేరకొని అక్కడ నుంచి నరసరావుపేట, వినుకొండ హైవే మీదుగా తిరిగి వెళ్లాలి.

➡ కోటప్పకొండ నుంచి తిరిగి చిలకలూరిపేటకు వెళ్లేవారు యూటీ జంక్షన్ నుంచి కట్టుబడివారిపాలెం, కమ్మవారిపాలెం గ్రామాల మీదుగా వెళ్లాలి.

నేషనల్ పవర్ లిఫ్టింగ్‌లో అనీల్‌రెడ్డికి ప్రథమ స్థానం

నరసరావుపేట: రొంపిచర్ల మండలం రామిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన మూలే అనీల్‌రెడ్డి నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం సొంతం చేసుకున్నాడు. ఓపెన్ ఆసియా పవర్ లిఫ్టింగ్, క్లాసిక్ అండ్ నేషనల్ చాంపియన్ షిప్-2025 పోటీలను గుజరాత్ రాష్ట్రంలోని సూరత్, అత్‌వాలీనెస్‌లోని పండిట్ దయాల్ ఉపాధ్యాయ ఇండోర్ స్టేడియంలో ఈనెల 21 నుంచి 23వరకు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ సూరత్ అండ్ సూరత్ సిటీ పోలీసు, పవర్ లిఫ్టింగ్ ఇండియా సంస్థ నిర్వహించాయి. ఈ పోటీల్లో పాల్గొన్న అనీల్‌రెడ్డి 65 కేజీల విభాగంలో 405 కేజీల బరువు ఎత్తి ప్రథమస్థానంలో నిలిచాడు. అతనికి వరల్డ్ రా పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ఇండియా (డబ్ల్యూఆర్‌పీఎఫ్) అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ లోహబ్, ధర్మేష్‌పటేల్ మెడల్, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. అనీల్‌ను రామిరెడ్డిపాలెం గ్రామస్తులు అభినందించారు.



సూరత్‌లో అనీల్‌రెడ్డికి మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రకా'శివ'ంతం



అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయాన్ని బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. రాజగోపురంపై విద్యుద్దీప కాంతుల్లో తళుకులీనుతున్న పార్వతీ పరమేశ్వరుల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

– అమరావతి

మరింత మందికి ఆహారం అందించాలి

– కలెక్టర్ అరుణ్‌బాబు

సత్తెనపల్లి: అన్న క్యాంటీన్‌లో మరింత మందికి ఆహారం అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు చెప్పారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను సోమవారం రాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆహారం తింటున్నవారితో మాట్లాడారు. నాణ్యతను పరిశీలించేందుకు ప్లేట్‌లో ఆహారం పెట్టించుకున్న కలెక్టర్ అదే సమయంలో ఇద్దరికి ఆహారం లేకపోవడంతో ఆ ప్లేట్‌ను వారికి అందించారు. నిత్యం ఎంత మందికి ఆహారం సరఫరా చేస్తున్నారని ప్రశ్నించారు. వందమందికి అందిస్తున్నట్టు నిర్వాహకులు చెప్పడంతో మరింత మందికి అందించాలని సూచించారు. క్యాంటిన్ నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయనతోపాటు సత్తెనపల్లి ఆర్డీఓ జీవీ రమణాకాంత్ రెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, మున్సిపల్ డీఈ వెంకటరమణ, తదితరులు ఉన్నారు.



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించండి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పిలుపు

నరసరావుపేట: కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు ఇస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పిలుపు ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆలపాటి రాజాను చిత్తుగా ఓడించాలని కోరారు. పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న లక్ష్మణరావు మంచి విద్యావేత్త అని, పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల కోసం నిత్యం పోరాడుతూ ఉంటారని, ఆయన గెలుపు నిరుద్యోగుల జీవితాలకు వెలుగునిస్తుందని పేర్కొన్నారు.

ఏబీ కెనాల్లో పడి శ్రీకాకుళం వాసి గల్లంతు

శివమాల వేసి శ్రీశైలం వెళ్తుండగా ఘటన



శావల్యాపురం: గంటావారిపాలెం గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్ మెట్ల మార్గంలో ఓ శివ మాలధారి గల్లంతైన ఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం దాసరిపుట్టుగ గ్రామానికి చెందిన దాసరి మోహన్‌రావు (50) శివమాల వేశాడు. ఈ క్రమంలో తన సహచర భక్తులు 12 మందితో కలిసి స్వగ్రామం నుంచి ప్రత్యేక వాహనంలో శ్రీశైలం బయలుదేరారు. మార్గమధ్యంలో అద్దంకి బ్రాంచ్(ఏబీ) కెనాల్ దగ్గరకు రాగానే స్వాములు సద్ది సమయం కావటంతో స్నానం చేయటానికి కెనాల్ వద్దకు వెళ్లారు. కాల్వ మెట్ల మార్గంలో మోహన్‌రావు స్నానం చేస్తుండగా కాలు జారి ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయాడు. తోటి స్వాములు రక్షించటానికి చేసిన యత్నాలు ఫలించలేదు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే దాసరి మోహన్‌రావు వృత్తిరీత్యా అసోంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కళ్లెదుటే సహచరుడు కాల్వలో గల్లంతు కావడంతో మిగిలిన శివ స్వాములు శోకసముద్రంలో మునిగిపోయారు. మోహన్‌రావు గల్లంతైన విషయాన్ని పోలీసులు అతని కుటుంబ సభ్యులకు సెల్‌ఫోను ద్వారా తెలియజేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు మృతికి కారకులపై కేసు నమోదు చేయండి

ఎస్పీకి తల్లిదండ్రులు ఫిర్యాదు

నరసరావుపేట: తమ కుమారుడు మృతికి కారకులైన కోడలు, ఆమె తల్లిదండ్రులు, ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని మృతుని తల్లిదండ్రులు, బంధువులు కోరారు. ఈ మేరకు ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించేందుకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వారి కథనం ప్రకారం.. కారెంపూడి మండలం పేటసన్నెగండ్ల తండావాసి బాణావత్ నాగేశ్వరరావు నాయక్ కుమారుడు గోపీనాయక్(34)కు 14 ఏళ్ల క్రితం తన చెల్లెలు కుమార్తెతో పెళ్లి జరిపించాడు. వారికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. కోడలు పేటసన్నెగండ్లకు చెందిన కాసుల కుమారుడు షేక్ కరిముల్లాతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో పలుమార్లు హెచ్చరించారు. పెద్దమనుషులు సమక్షంలో పంచాయితీ జరిగినా ఆమెలో మార్పులేదు. గోపీనాయక్‌ను చంపి అడ్డం తొలగించుకోవాలనే ఉద్దేశంతో కోడలు, ఆమె ప్రియుడు, ఆమె తల్లిదండ్రులు పథకం రచించి కారెంపూడి వెళ్లి పురుగుమందుల డబ్బా కొని తీసుకొచ్చి గతేడాది సెప్టెంబరు 27న గోపీనాయక్‌కు స్పిరిట్‌లో కలిపి ఇచ్చారు. దీంతో వాంతులు చేసుకుంటున్న గోపీనాయక్‌ను గుంటూరులోని ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్పించగా పరిస్థితి విషమించి అక్టోబర్ 1న మరణించాడు. దీనిపై కారెంపూడి పోలీసులకు గోపీనాయక్ తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. అయినా నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కేసు నమోదు చేసి దర్యాప్తుచేయాలని గోపీనాయక్ తల్లిదండ్రులు కోరుతున్నారు.



వివరాలు వెల్లడించిన బాణావత్ నాగేశ్వరరావు నాయక్ దంపతులు, బంధువులు

సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీల్లో ఏపీ విజయం

జట్టులో యద్లపాడు పైపల్లె అక్కాచెల్లెళ్లు

యద్లపాడు: సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు విజయకేతనం ఎగురవేసింది. ఈనెల 22, 23 తేదీల్లో బాపట్ల మండలం చిమ్మిరిబండ గ్రామంలో సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్‌బాల్ బాలుర, బాలికల విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో ఆరురాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్ బాలికల విభాగంలో తెలంగాణపై రెండు- సున్నా తేడాతో విజయం సాధించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

మరిన్ని విజయాలు సాధించాలి...

యద్లపాడు గ్రామం పైపల్లె (ఎస్సీకాలనీ)కి చెందిన కోడిరెక్క అన్నమ్మ కుమార్తెల్లో కోడిరెక్క ధనలక్ష్మి ఏపీ బాలికల జట్టు కెప్టెన్‌గా వ్యవహరించగా ఆమె సోదరి కోడిరెక్క పాప సభ్యురాలిగా సత్తాచాటింది. ఈ సందర్భంగా బోయపాలెం విశ్వతేజ నూలు మిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్ సోమవారం అక్కాచెల్లెళ్లు ఇద్దరినీ అభినందించారు. గతంలో కెప్టెన్ ధనలక్ష్మికి రూ.55వేలు ఆర్థికసాయం అందించామని, ఈసారి అక్కాచెల్లెళ్లకు బీటెక్, డిగ్రీలలో చేరేందుకు కళాశాలల ఫీజులను చెల్లిస్తామని హామీ ఇచ్చారు.



క్రీడాకారులిద్దరినీ అభినందిస్తున్న విశ్వతేజ నూలుమిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్

పొగాకు బోర్డు వైస్ ఛైర్మన్‌గా బ్రహ్మయ్య

కొరిటెపాడు(గుంటూరు): 164వ పొగాకు బోర్డు సమావేశం గుంటూరు జీటీ రోడ్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ అధ్యక్షతన సోమవారం సాయంత్రం జరిగింది. సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కర్నాటక ప్రాంత పంట కాలానికి పంట పరిమాణంను నిర్ధారించారు. బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబులు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్, ఇండియన్ టుబాకో అసోసియేషన్(ఐటీఏ), పొగాకు ఎగుమతిదారులు ఇచ్చిన ఇండెంట్ అనుగుణంగా 2025-26 కర్నాటక ప్రాంత పంట కాలానికి 100 మిలియన్ కిలోల పరిమాణాన్ని నిర్ధారించినట్లు వివరించారు. అంతేకాకుండా పొగాకు బోర్డు వైస్ ఛైర్మన్‌గా బొడ్డపాటి బ్రహ్మయ్యను సభ్యులందరూ ఎన్నుకున్నట్లు వారు వెల్లడించారు. బోర్డు పాలకవర్గ సభ్యులు హెచ్‌సీ బసవరాజు, మారెడ్డి సుబ్రమణ్యేశ్వరరెడ్డి, గుత్తా వాసుబాబు, బి.రమేష్‌పాయ్, విక్రమ్ రాజ్, పోద వరప్రసాద్, హెచ్‌ఆర్ దినేష్ పాల్గొన్నారు. వర్చువల్ కాన్ఫరెన్స్ విధానంలో ఐఏఆర్ఎస్ డిప్యూటీ సెక్రటరీ మౌనికా గౌర్, డాక్టర్ మాగుంట శేషు మాధవ్‌లు పాల్గొన్నారు.

ఇంటి దగ్గరే లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు అనారోగ్యం, ఇతర కారణాలతో లైఫ్ సర్టిఫికెట్ల కోసం రాలేని పరిస్థితులలో అసోసియేషన్ ప్రతినిధులు ఇంటి వద్దకే వచ్చి తీసుకునే వెసులుబాటు కల్పించినట్టు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మానం సుబ్బారావు తెలిపారు. అసోసియేషన్ భవన్‌లో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ, ఫిబ్రవరి నెల ముగుస్తున్న నేపథ్యంలో సభ్యులు వెంటనే ట్రెజరీ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్లు అందచేయాలని కోరారు. ఫ్యామిలీ పెన్షన్‌లు, హెల్త్ కార్డులలో సవరణలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని తెలిపారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు లంకా రంగనాయకులు, కార్యదర్శి సి.సి.ఆదెయ్య, కోశాధికారి ఎంఎస్ ఆర్‌కె ప్రసాదు, అసోసి యేట్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ నాగభూషణం పాల్గొన్నారు.

ఫ్యాన్సీ దుకాణంలో అగ్నిప్రమాదం

రూ.15 లక్షల ఆస్తినష్టం



మంటల్లో కాలుతున్న ఫ్యాన్సీ దుకాణం

నకరికల్లు: విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఫ్యాన్సీ దుకాణంలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ప్రాణ నష్టం తప్పినా రూ.15 లక్షలకుపైగా ఆస్తినష్టం సంభవించింది. నకరికల్లులోని అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి అండర్‌పాస్ ఎదుట జూలకంటి సతీష్‌కు చెందిన భవనంలో ఫ్యాన్సీ దుకాణం, ఇల్లు ఉన్నాయి. ఆదివారం రాత్రి దుకాణం మూసివేసి ఆస్పత్రిలో ఉన్న బంధువులను పలకరించేందుకు నరసరావుపేటకు భార్యను తీసుకొని వెళ్లాడు. వారి కుమారుడు ఒక్కడే దుకాణంలో నిద్రిస్తున్నాడు. సోమవారం తెల్లవారురూమున ఫ్యాన్సీ దుకాణంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దుకాణంలో నిద్రిస్తున్న సతీష్ కుమారుడు ఒక్కసారిగా వ్యాపించిన మంటలకు భయంతో షట్టర్ తీసుకొని బయటకు పరుగులు తీశాడు. చుట్టుపక్కన వారిని పిలిచాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. సుమారు 4 గంటలపాటు శ్రమించి మంటలను అదుపుచేసే యత్నం చేశారు. ప్రమాదంలో దుకాణంలోని ఫ్యాన్సీ వస్తువులు, పుస్తకసామగ్రి, ఎలక్ట్రానిక్, ఫర్నిచర్ సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.15 లక్షలకుపైగా నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఫ్రిజ్ దగ్గర విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

కోర్కెలు తీర్చే బాలకోటేశ్వరుడు



ఆలయ ధర్మకర్త చీమకుర్తి యలమందయ్య సమాధి



తిరునాళ్లకు సిద్ధమైన దేవాలయం



క్వారీ బాలకోటేశ్వరస్వామి మూల విరాట్

- భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి
- మహా శివరాత్రి తిరునాళ్లకు సన్నద్ధం

చేబ్రోలు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. రంగులతో ఆలయాన్ని చక్కగా తీర్చిదిద్దారు. జిల్లాలో కోటప్పకొండ తిరునాళ్ల తరువాత చెప్పుకోదగినది ఇదే. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ఇక్కడి స్వామి విరాజిల్లుతున్నారు. సుమారు వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఆలయం వద్ద సుమారు 80 సంవత్సరాలుగా ఏటా తిరునాళ్ల జరుగుతోంది. మొదటిసారిగా చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామస్తులు ప్రభను తిరునాళ్లకు తీసుకొచ్చినట్లు ప్రతీతి.

ఇదీ తిరునాళ్ల నేపథ్యం...

1920వ సంవత్సరంలో చీమకుర్తి యలమందయ్య వడ్లమూడి గ్రామంలోని తన పొలం దున్నుతుండగా శివలింగం బయటపడింది. విగ్రహాన్ని అక్కడే ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు చేశారు. గ్రామంలో అరిష్టాలు జరగటంతో దీనికి కారణం విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్లక్ష్యం చేయటమేనని స్థానికులు భావించారు. ఓ రోజు యలమందయ్యకు కలలో బాలకోటేశ్వరస్వామి కనిపించి తనకు గుడి నిర్మించి పూజలు చేయవలసిందిగా ఆజ్ఞాపించారని ప్రచారం ఉంది. స్వామి వారి ఆజ్ఞానానుసారం యలమందయ్య పొలంలో లభించిన శివలింగానికి గుడి కట్టించి పూజాది కార్యక్రమాలు చేయించారు. దేవుని సేవలో నిమగ్నమయ్యారు.



తిరునాళ్లకు వచ్చిన భారీ విద్యుత్ ప్రభలు (ఫైల్)

మొదటి సారిగా మండలంలోని గొడవర్రు గ్రామస్తులు ప్రభను తిరునాళ్లకు తీసుకువచ్చారు. అప్పటి నుంచి గొడవర్రు గ్రామ ప్రభ దేవాలయానికి మహా శివరాత్రికి ముందు వరుసలో ఉంటుంది. శివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచి సుమారు లక్ష మంది భక్తులు వస్తుంటారు. ఆలయ ధర్మకర్త యలమందయ్య కోరిక మేరకు ఆయన మరణానంతరం ఆలయానికి ఆగ్నేయ దిశలో తెనాలి రోడ్డు పక్కనే సమాధి చేశారు. కాలక్రమంలో భక్తుల రాక పెరగటంతో ఆలయం అభివృద్ధి చెందింది. సూర్యదేవర వెంకటప్పయ్య అనే భక్తుడు నిజాంపట్టణం మండలం నక్షత్ర నగర్‌లో తనకు ఉన్న ఎకరం భూమిని ఆలయ నిర్వహణకు రాసిచ్చారు. జిల్లాలో వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఆదరణ, గుర్తింపు లభించటంతో అధికారులు ఈ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తెచ్చారు. కోరిన కోర్కెలు తీరతాయని భక్తుల నమ్మకం. భారీ విద్యుత్ ప్రభలు ఈ తిరునాళ్లలో ప్రత్యేక ఆకర్షణ. నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, సుద్దపల్లి, చేబ్రోలు, శలపాడు, శేకూరు, వడ్లమూడి గ్రామాల నుంచి 15 వరకు భారీ విద్యుత్ ప్రభలు, వందల సంఖ్యలో చిన్న ప్రభలు తిరునాళ్లకు దేవాలయానికి వస్తాయి. ఆలయం వద్ద ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా 26వ తేదీన జరిగే మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.